క్లుప్తంగా

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



గూడూరు: గూడూరు మండలం జమీరామరాజు పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆ పథకం ఏడీ వి.మనోహర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాలు రుచిగా, శుచిగా ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన మనోహర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేయాలని సూచించారు. ప్రభుత్వం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తోందని, తద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటుగా శారీరకంగా ధృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 పి.సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.మహాంకాళి రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ మనోహర్ దానిమ్మ పండ్లను పంపిణీ చేశారు.

తహసీల్దార్ల నియామకం



చిట్టిబాబు, ఘంటసాల తహసీల్దార్

ఘంటసాల: ఘంటసాల మండల తహసీల్దార్‌గా డీటీ చప్పిడి చిట్టిబాబు పూర్తి అదనపు బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ఘంటసాల తహసీల్దార్‌గా చేస్తున్న బి.ఎన్.విజయలక్ష్మి బదిలీల్లో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లారు. దీంతో డీటీ చిట్టిబాబు తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది చిట్టిబాబును అభినందించారు.

గూడూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శివశంకర్

గూడూరు: గూడూరు మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డెప్యూటీ తహసీల్దార్ వై.శివశంకర్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ఎస్.ఎస్.శాంతిని ప్రభుత్వం పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేసింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషన్ నిర్వహించిన బదిలీల్లో భాగంగా శాంతి గూడూరు తహసీల్దార్‌గా నియమితులయ్యారు. గూడూరు ఇన్‌చార్జిగా డెప్యూటీ తహసీల్దారు శివశంకర్‌కు సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించి శాంతి రిలీవ్ అయ్యారు.

అబ్దుల్ నయీమ్‌కు సత్కారం



ఘంటసాల: పదోన్నతిపై వెళ్తున్న అబ్దుల్ నయీమ్ సమర్థవంతంగా పని చేసి ప్రజలు, అధికారుల మన్ననలను పొందాలని ఎంపీడీఓ బి.మారుతీ శేషమాంబ అన్నారు. ఘంటసాల మండలం మల్లంపల్లి పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అబ్దుల్ నయీమ్ పదోన్నతిపై కంచికచర్ల మండలం మొగులూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా వెళ్తున్నారు. సోమవారం రిలీవ్ అయిన నయీమ్‌ను ఎంపీడీఓ మారుతీ శేషమాంబ, పంచాయతీ కార్యదర్శి బోలెం అర్జునరావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. మొవ్వ, ఘంటసాల మండలంలోని ఘంటసాల, మల్లంపల్లి పంచాయతీల్లో 15 ఏళ్లుగా జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి పొందిన ఆయనను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, ఈవోలు, సహోద్యోగులు అభినందించారు. ఆయన సేవలను కొనియాడారు. మండల పరిషత్ ఏఓ కేజే శ్రీనివాస్ చంద్, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ల వితరణ

మోపిదేవి: స్థానిక ఆశ్రమ పాఠశాల వసతి గృహానికి రెండు సీలింగ్ ఫ్యాన్లను జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు సోమవారం సాయంత్రం వార్డెన్ లంకేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వసతి గృహాన్ని సందర్శించిన సమయంలో విద్యార్థులు సీలింగ్ ఫ్యాన్‌లు కావాలని కోరారన్నారు. తన వంతు సాయంగా సీలింగ్ ఫ్యాన్‌లు వసతి గృహానికి అందజేశానన్నారు. జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు భోగిరెడ్డి సాంబయ్య, మెరకనపల్లి నరేష్, బాధర్ల లోలాక్ష నాయుడు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజనాలను పరిశీలించారు.

పిచ్చి మొక్కలకు కలుపు మందు పిచికారీ

మోపిదేవి: ప్రధాన రహదారులు, వీధుల వెంట పిచ్చి మొక్కలకు కలుపు మందు పిచికారీ చేసినట్లు గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు తెలిపారు. మోపిదేవి ప్రధాన రహదారుల వెంట పిచ్చిమొక్కల కలుపు మందును సోమవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి సూచనల మేరకు వర్షాలు ప్రారంభం కావడంతో దోమ, పురుగులు పెరిగే అవకాశం ఉన్నందున కలుపు మందు పిచికారీ చేయించామన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్, తైక్వాండో క్రీడాకారులకు అభినందన



గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో హెచ్‌ఎం వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు

గోగినేనిపాలెం(ఘంటసాల): రాష్ట్ర స్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు సోమవారం అభినందించారు. కృష్ణాజిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా సాఫ్ట్ బాల్ జట్లను ఎంపిక చేశారు. దీనిలో భాగంగా గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు అండర్ - 18 విభాగంలో సాఫ్ట్ బాల్ జూనియర్స్ జట్టుకు ఎంపికయ్యారు. బాలికల్లో ఐదుగురు, బాలుర విభాగంలో ఆరుగురు ఉమ్మడి కృష్ణాజిల్లా సాఫ్ట్‌బాల్ జూనియర్స్ విభాగానికి ఎంపికయ్యారు. వీరు ఆగస్టు 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం వేణుగోపాలరావు తెలిపారు. విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన పీడీ గరికపాటి మారుతీ, ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులను సర్పంచ్ కుంపటి సుశీల, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోనేరు శ్రీనివాసరావు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఈశ్వర్ అకాడమీ విద్యార్థుల ఎంపిక

అవనిగడ్డ: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఈశ్వర్ అకాడమీ విద్యార్థులు ఎంపికైనట్లు అధ్యక్షురాలు పి.విశ్వ తెలిపారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ ఆదివారం విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల ప్రాంగణంలో అండర్ - 11, 14 విభాగాల్లో నిర్వహించిన తైక్వాండో పోటీలకు ఉమ్మడి కృష్ణాజిల్లాల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఈశ్వర్ డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నుంచి వివిధ కేటగిరీల్లో పాల్గొన్న విద్యార్థులు వి.శ్రావణి, సీహెచ్.సాత్విక, కె.ఖజియా, కె.తేజేష్, ఎమ్.ఫణి గిరిధర్, చరణ్ సాయి మణికంఠలు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారన్నారు. వి.నాగసాయి కార్తీక్, కె.జాహ్నవ్ మణిదీప్ కుమార్‌లు రజతం, ఎస్.నాగ ప్రత్యూష, బి.శ్రీకౌషిక్, వి.సాయి చాణక్య, సీహెచ్.శబరీష్‌లకు కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్‌లు అయిన కేవీ సుబ్బు, రవినాగ అరవింద్, జాహ్నవిలను జిల్లా కోశాధికారి మాస్టర్ ఈశ్వర్, అకాడమీ అధ్యక్షురాలు విశ్వ అభినందించారు. బంగారు పతకాలుసాధించిన విద్యార్థులు ఆగస్టు 3, 4 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రాణించి దివిసీమకు, అకాడమీకి పేరు తీసుకురావాలని విశ్వ ఆకాంక్షించారు.

తైక్వాండోలో సత్తా చాటిన మచిలీపట్నం విద్యార్థిని

మచిలీపట్నంటౌన్: విజయవాడ లయోలా కాలేజ్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన అండర్ - 14(38 కేజీల లోపు) బాలికల విభాగంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో మచిలీపట్నం జనశక్తినగర్‌కు చెందిన విశ్వనాథపల్లి శ్రావణి బంగారు పతకం సాధించి సత్తా చాటింది. స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విశ్వనాథపల్లి శ్రావణి ఆగస్టు రెండో తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొననుంది. జిల్లా తైక్వాండో సెక్రటరీ గ్రాండ్ మాస్టర్ పి.ఈశ్వర్ శ్రావణికి కోచ్‌గా వ్యవహరించారు. మచిలీపట్నంకు చెందిన విద్యార్థిని తైక్వాండోలో విశేష ప్రతిభ చూపడంతో ఆమె తండ్రి విశ్వనాథపల్లి శరత్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థినులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



తైక్వాండోలో తలపడుతున్న శ్రావణి(రెడ్ జాకెట్)



ఈశ్వర్ అకాడమీ విద్యార్థులతో విశ్వ, ఈశ్వర్, కోచ్‌లు

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్లకు సత్కారం

పెడన: పెడన తహసీల్దార్‌గా సాధారణ ఎన్నికలకు ముందు భీమవరం నుంచి వచ్చిన ఆర్.రాంబాబు సోమవారం సాయంత్రం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో రాంబాబును తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, వీఆర్వోలు ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా రాంబాబు ఏఈఆర్వోగా, తహసీల్దారుగా అంకితభావంతో విధులను నిర్వహించడంతో సిబ్బందిని సైతం బాధ్యతలను గుర్తు చేస్తూ రాణించారంటూ కొనియాడారు. రాంబాబుకు వీడ్కోలు పలికిన వారిలో డెప్యూటీ తహసీల్దార్ పూర్ణచంద్రరావు, ఆర్ మణికుమార్‌లతో పాటు వీఆర్వోలు, పెడన ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ తదితరులున్నారు. తహసీల్దార్‌గా రాంబాబు రిలీవ్ కావడంతో డెప్యూటీ తహసీల్దార్ కె.పూర్ణచంద్రరావుకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలను అప్పగించారు.



పెడన తహసీల్దార్ రాంబాబును సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తహసీల్దార్ విజయలక్ష్మికి సన్మానం

ఘంటసాల: బదిలీపై వెళ్తున్న ఘంటసాల మండల తహసీల్దార్ ఎన్.బి.విజయలక్ష్మిని రెవెన్యూ శాఖ ఉద్యోగులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఘంటసాల మండలం తహసీల్దార్‌గా వచ్చిన విజయలక్ష్మి ఎన్నికల కోడ్ ముగియడంతో తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా సొంత జిల్లా పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ చప్పిడి చిట్టిబాబు ఆధ్వర్యంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది తహసీల్దార్ విజయలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో సర్వేయర్ డీటీ శ్రీనివాసరావు, రెవెన్యూ శాఖ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ విజయలక్ష్మిని సత్కరిస్తున్న ఉద్యోగులు

తహసీల్దార్ శ్రీనివాసరావుకు సన్మానం

కోడూరు: కోడూరు నుంచి బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ టి.శ్రీనివాసరావును రెవెన్యూ సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. బదిలీల్లో భాగంగా శ్రీనివాసరావును ప్రభుత్వం ఎన్నికల ముందు విధులు నిర్వహించిన అల్లూరు సీతారామరాజు జిల్లాకు వెళ్లారు. దీంతో శ్రీనివాసరావుకు సిబ్బందికి జ్ఞాపిక అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రస్తుతం డెప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పద్మప్రియ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నారు.



తహసీల్దార్ శ్రీనివాసరావుతో రెవెన్యూ సిబ్బంది

సిరివెళ్లపాలెంలో రేషన్‌షాపు సీజ్

కోనేరుసెంటర్: బందరు మండలం సిరివెళ్లపాలెంలోని రేషన్ దుకాణాన్ని రెవెన్యూ సిబ్బంది సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో షాపు నంబర్ 48ను నడుపుతున్న బోయిన నాగలక్ష్మి నిత్యావసర సరుకులకు సంబంధించి అవకతవకలకు పాల్పడినట్లు తేలటంతో మరింత విచారణ జరిపిన డెప్యూటీ తహసీల్దార్ సుభాన్‌బీ 32 బియ్యం బస్తాలు తగ్గినట్లు గుర్తించటంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా మూడేళ్లగా షాపును గ్రామంలోని పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో 6ఏ కింద కేసు నమోదు చేసి దుకాణాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

నాగాయలంకలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

నాగాయలంక: పరిసరాల పరిశుభ్రతలో భాగంగా వర్షాలు పడుతున్న క్రమంలో నాగాయలంకలో పంచాయతీ అధికారులు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. జిల్లా పంచాయతీ రాజ్ యంత్రాంగం, కలెక్టర్ ఆదేశాలు, సూచనల నేపథ్యంలో వర్షాలకు ఏర్పడిన నీటి గుంతల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి జె.హెచ్.వి.పవన్‌కుమార్ తెలిపారు. పంచాయతీ పాలక వర్గ సభ్యులు సహకారం, సర్పంచ్ కైతేపల్లి అంకాలు, ఉపసర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు(నాని) పర్యవేక్షణలో పంచాయతీ పారిశుధ్య సిబ్బంది శానిటేషన్ చేస్తున్నారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో హెల్త్ ఆఫీసర్‌ను నియమించండి

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరపాలక సంస్థ కార్యాలయంలో హెల్త్ ఆఫీసర్‌ను నియమించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు - పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావుకు వినతిపత్రం అందజేశారు. మచిలీపట్నం నగరంలో టీటీడీ కల్యాణ మండపాన్ని పునఃప్రారంభించాలని, సర్వజన ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలన్నారు. నగరపాలక సంస్థలో కొన్నేళ్లుగా హెల్త్ ఆఫీసర్ లేకపోవటంతో ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారని చెప్పారు. అలాగే సర్వజన ఆస్పత్రిలో ఎండోస్కోపీ పరికరాన్ని, మహాప్రస్థానం వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి ప్రైవేటు అంబులెన్స్ దోపిడీని అరికట్టాలని కోరారు. డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘ నాయకులు నిక్కు రాధాకృష్ణ, బొగ్గు పవన్ తదితరులు ఉన్నారు.



డీఆర్వో చంద్రశేఖరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

తెలుగురావుపాలెంలో పాఠశాల ఏర్పాటు చేయండి

తెలుగురావుపాలెం(ఘంటసాల): తమ గ్రామంలో నూతన ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ తెలుగురావుపాలెం గ్రామ సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీకి సోమవారం అర్జీ సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలతో గ్రామంలోని ఆర్‌సీఎం పాఠశాలను మూసివేశారన్నారు. దీంతో 1.5 కి.మీ.దూరంలో ఉన్న శ్రీకాకుళం ఎంపీపీఎస్ స్కూల్‌కు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పాఠశాల ప్రారంభించాలని కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పశువుల చావిడి దగ్ధం

కోడూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో పశువుల చావిడి దగ్ధమై మూడు గేదెలు మృతిచెందిన ఘటన కోడూరులో జరిగింది. కోడూరుకు చెందిన కోట రాంబాబు తన నివాస గృహం పక్కనే పశువుల చావిడిని ఏర్పాటు చేసి అందులో గేదెలను కట్టేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి కూడా రాంబాబు తన పశుసంపదను చావిడిలో కట్టేశాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో విద్యుత్ సర్క్యూట్ సంభవించి పశువుల చావిడి మొత్తం అగ్నికి ఆహుతైంది. నిమిషాల వ్యవధిలో చావిడంతా మంటలు వ్యాపించడంతో పశువులు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో చావిడిలో ఉన్న మూడు గేదెలు మంటల్లో కాలి మృతిచెందాయి. విషయం తెలుసుకున్న అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి వచ్చి మంటలు పక్కకు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.2.50 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు రాంబాబు తెలిపాడు. వివిధ రాజకీయ పార్టీల ప్రముఖుల ఘటనాస్థలాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కీరపండరీ క్షేత్రంలో శాకంబరీ ఉత్సవాలు

మచిలీపట్నంటౌన్: స్థానిక చిలకలపూడిలోని కీరపండరీ క్షేత్రంలో స్వయంభుగా వెలిసిన శ్రీ పాండురంగ స్వామి వారి దేవాలయంలో శాకంబరీ ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కొలువైన రుక్మిణి, సత్యభామ, రాధ అమ్మవార్లు సోమవారం శాకంబరీ అలంకారంలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రతి ఏడాది మాదిరిగా ఆషాఢ మాసంలో అందించే సారెను భక్తులు సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా లలితా, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన పూజారి, నిర్వాహకులు టీకి నరసింహం పర్యవేక్షించారు.



శాకంబరీదేవిగా రుక్మిణి అమ్మవారు

తిరుమలలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సందర్శించారు. మండలి బుద్ధప్రసాద్, విజయలక్ష్మి దంపతులతో పాటు ఆయన కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



తిరుమలలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దంపతులు

అద్దంకి నాంచారమ్మ తల్లికి సారె సమర్పణ



సారె సమర్పించేందుకు వస్తున్న మహిళలు

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ అద్దంకి నాంచారమ్మ తల్లికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. గ్రామంలో మహిళలంతా సామూహికంగా ప్రధాన సెంటర్ నుంచి పట్టు చీర, పసుపు, కుంకుమ, పండ్లు, పూలతో పాటు పలురకాలు పిండి వంటకాలతో గ్రామంలో మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి సారెను అమ్మవారికి సమర్పించుకున్నారు. బంధుమిత్రులతో పాటు సమీప గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చిన్నారుల శారీరక ఎదుగుదల పరిశీలించాలి

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మోపిదేవి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

మోపిదేవి: చిన్నారుల శారీరక ఎదుగుదల పరిరక్షణకై వారి ఎత్తు, బరువు పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. మండల కేంద్రం మోపిదేవి ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. చిన్నారుల హాజరు పట్టీ, చిన్నారులకు అందిస్తున్న పాలు, పౌష్టికాహారం వివరాలు స్టాకు రిజిస్టర్‌లో నమోదును పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువు సరి చూసి రిజిస్టర్‌లో కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు తగిన వైద్య పరీక్షలు చేయడంతో పాటు నిర్ణీత సమయంలో వ్యాక్సినేషన్ వేయించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టంచేశారు. మండల సూపర్‌వైజర్ రత్నమాల, ఎంఈఓ దుర్గా సాగర్, హెచ్‌ఎం స్వరూపరాణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలేఖాన్‌పేట హైస్కూల్‌లో తిథి భోజనం



కాలేఖాన్‌పేట హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా, అధికారులు

మచిలీపట్నంటౌన్: స్థానిక కాలేఖాన్‌పేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సోమవారం తిథి భోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి తాహెరాసుల్తానా విద్యార్థినీ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరుపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆరోగ్యం, పరిశుభ్రత అనే అంశాలపై ఆమె ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతను అలవాటు చేయాలన్నారు. తిథి భోజనం కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం అసిస్టెంట్ డైరెక్టర్ మనోహర్ నాయక్, ఉప విద్యాశాఖాధికారి శేఖర్ సింగ్, ఎంఈఓలు ఎంవీఎస్‌డీ ప్రసాద్, వైఎస్ఆర్‌కె గురు ప్రసాద్, హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు దాతల చేయూత ప్రశంసనీయం

చల్లపల్లి(అవనిగడ్డ): ప్రభుత్వ పాఠశాలలల్లో జరిగే కార్యక్రమాల్లో దాతలు చేయూత నివ్వడం ప్రశంసనీయమని చల్లపల్లి మండల విద్యాశాఖాధికారి 1 జీఎస్‌బీ గోపాల్ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా తిథి భోజనాన్ని పురస్కరించుకుని చల్లపల్లి మండలం పురిటిగడ్డ ప్రాథమిక పాఠశాలకు ఉయ్యూరుకు చెందిన దాత ఎండీ ఇస్మాయేల్ 20 లీటర్ల సన్‌ఫ్లవర్ ఆయిల్, 10 కేజీల కందిపప్పు, ఉల్లిపాయలు, ఇతర వంట సామగ్రిని సమకూర్చారు. వీటిని ఎంఈవో గోపాల్ చేతుల మీదుగా వంట ఏజెన్సీ మహిళలకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా పోషకాలతో కూడిన ఆహారం విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు దేవరపల్లి సురేష్, బి.నాగలక్ష్మి, వంట కార్మికురాలు మద్దాల నాగరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్ కంప్యూటర్‌తో కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

పెడన: బీటెక్ విద్యార్థులు సూపర్ కంప్యూటర్ ద్వారా కొత్త పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని ప్రొఫెసర్ ఎం.కిషోర్‌కుమార్ అన్నారు. మండలంలోని నందమూరు శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ, సీఎస్ఈ, మెక్, సివిల్ విద్యార్థులకు, అధ్యాపకులకు సూపర్ కంప్యూటర్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యూఢిల్లీ అఖిలభారత సాంకేతిక విద్యాశాఖ ద్వారా శిక్షణ పొందిన కిషోర్‌కుమార్ సూపర్ కంప్యూటర్‌పై విద్యార్థులకు పలు విషయాలను వెల్లడించారు. కళాశాల కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, విభాగాధిపతి షేక్ ఖాదర్‌జిలానీ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి.శ్రీధర్, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కిషోర్‌కుమార్‌ను సన్మానించారు.

మహా శివలింగానికి అభిషేకాలు



శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు

నాగాయలంక: స్థానిక కృష్ణానదిలోని శ్రీగంగ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి మండపంలో సోమవారం మహా శివలింగానికి భక్తిశ్రద్ధలతో బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో పలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు జరిపారు. తొలుత శ్రీరామపాద క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావుచే రామలింగేశ్వరునికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, విభూది, నారికేళ, గోక్షీరం తదితర పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఈసందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు కృష్ణానదిలోని పవిత్ర జలంతో శివయ్యకు అభిషేకం చేశారు. స్వామివారికి అలంకరణ, హారతి తదుపరి రామలింగేశ్వరునికి, నందీశ్వరునికి శాస్త్రోక్తంగా మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ గావించారు. అంతకు ముందు మండపంలో శివయ్యకు బ్రహ్మశ్రీ యడవల్లి హరిబాబు బ్రహ్మత్వంలో పరిసర గ్రామాల భక్తులు అభిషేకాలు, పూజాధికాలు జరిపారు.